సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 23 । జూలై । 2024



ముప్కాల్‌లో పట్టపగలే చోరీ

ముప్కాల్‌లోని ఇందిరమ్మ కాలనీలో పట్టపగలే చోరీ జరిగింది. దొంగలు తొమ్మిది తులాల బంగారం అపహరించారు.

- 8లో ▸



ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.1 /22.7

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నాగమోహన్



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నాగమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మొన్నటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఇందిర సోమవారం రిలీవ్ కావడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఇందిర హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. సుమారు పదేళ్ల పాటు ఆమె ఇక్కడ విధులు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు ప్రొఫెసర్లు, వైద్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

జీజీహెచ్‌ను సందర్శించిన ఢిల్లీ బృందం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఢిల్లీ బృందం సోమవారం సందర్శించింది. గాలి ద్వారా ప్రబలే వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తున్నారో తెలుసుకోవడానికి నలుగురు సభ్యులతో కూడిన బృందం ఆస్పత్రికి వచ్చింది. ఈ సందర్భంగా సూపరిటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌తో కలిసి టీబీ వార్డు, ల్యాబ్, బ్రోంకోస్కోపీ, ఓపీ విభాగాల్లో ఎయిర్‌బోన్ ఇంఫెక్షన్ కంట్రోల్ మార్గదర్శకాల ప్రకారం పాటించాల్సిన పద్ధతులపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్, పార్థసారధి, జావీద్, డాక్టర్ ప్రమోద్‌రెడ్డి, హెచ్‌వోడీ వీవీ రావు, డాక్టర్ ఉదయ్‌కృష్ణ, జిల్లా టీబీ విభాగం కో-ఆర్డినేటర్ రవి, రమ్య పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి 620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం సాయంత్రం 620 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,405 అడుగులు(17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,387.80 అడుగుల(3.225 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

రేపు మున్సిపల్ కమిషనర్‌తో సాక్షి ఫోన్ ఇన్

వానాకాలంలో డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణతో 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తోంది. మున్సిపల్ పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య చర్యలపై ప్రజలు ఫోన్ చేసి మాట్లాడవచ్చు.

తేది : 24-07-2024 (బుధవారం)
సమయం: మధ్యాహ్నం 12:00 నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్ :
63037 55698

పసుపు బోర్డుకు నిధులిచ్చేనా?

- ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ పడేనా?
- 2016-17లో కేంద్ర క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద మంజూరు
- రాష్ట్రం నుంచి 50 శాతం నిధులు ఇచ్చేలా ఒప్పందం కాకపోవడంతో నిలిచిన ప్రక్రియ
- ఆదిలాబాద్, నిజామాబాద్ ఎంపీ స్థానాలను బీజేపీ వరుసగా రెండోసారి గెలవడంతో ఆశలు
- ఫుడ్ ప్రాసెసింగ్ స్టార్టప్‌ల ప్రోత్సాహంపై యువ రైతుల ఎదురుచూపులు
- ఎన్‌ఎస్‌ఎఫ్, ఎన్‌సీఎస్‌ఎఫ్‌లను పునఃప్రారంభించాలని డిమాండ్లు
- లక్కంపల్లి సెజ్‌లో ఆగ్రో యూనిట్ల ఏర్పాటుపై ఆశలు
- నేడు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్









పార్లమెంట్‌లో మంగళవారం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో జిల్లాకు లబ్ధి చేకూర్చే నిర్ణయాలు, నిధుల కేటాయింపుపై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి ప్రకటించిన పసుపు బోర్డుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, జిల్లాలో ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయమై అందరిలో ఆసక్తి నెలకొంది. పసుపు బోర్డుకు సంబంధించి గెజిట్ విడుదలైనప్పటికీ తదుపరి ప్రక్రియ ఇంకా మొదలుకాకపోవడంతో రైతులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేసే విషయమై అనేక ఏళ్ల నుంచి డిమాండ్లు ఉన్నాయి. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హయాంలోనే ఈ లైన్ సర్వేకు సంబంధించి నిధులు ఇస్తామని అప్పటి బడ్జెట్‌లో ప్రకటించారు. అయితే ఇప్పటివరకు ముందుకు పడలేదు. ఇదిలా ఉండగా 2016-17 కేంద్ర బడ్జెట్‌లో ఆర్మూర్-నిర్మల్-ఆదిలాబాద్ రైల్వే లైన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి 136 కిలోమీటర్ల లైన్‌కు రూ.2,720 కోట్లు అంచనాతో ప్రతిపాదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి 50 శాతం నిధులను భరించేలా నిర్ణయించారు. ఈ క్రమంలో కేంద్రం క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కింద మంజూరు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 50 శాతం వాటా రూ.1,360 కోట్లు ఇచ్చే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదరకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది.కాగా ఈ లైన్‌కు ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్-డిచ్‌పల్లి మీదుగా పటాన్‌చెరువు వరకు గతంలో ప్రతిపాదన ఉంది. గత సెప్టెంబర్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటన మరిన్ని ఆశలు పెంచింది. రూ.5,706 కోట్లతో ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్-నిజామాబాద్-బోధన్-బాన్సువాడ-నిజాంపేట-సంగారెడ్డి-పటాన్‌చెరువు లైన్‌కు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పైగా గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్, నిజామాబాద్ ఎంపీ సీట్లను సైతం బీజేపీ గెలుచుకోవడంతో ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసుల్లో ఆశలు పెరిగాయి. ఇక ఆర్మూర్ రైల్వేస్టేషన్‌కు ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం లేదు. ఈసారైనా దీనికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నిజామాబాద్- కాగజ్‌నగర్ లైన్‌లో రైళ్లు పెంచాలి..

నిజామాబాద్-ఆర్మూర్-కరీంగనర్-కాగజ్‌నగర్ లైన్‌లో రైళ్లు పెంచాలని కోరుతున్నారు. అదేవిధంగా నిజామాబాద్ మీదుగా ముంబైకి రైళ్ల సంఖ్య పెంచాలని, అయోధ్య, వారణాసికి ఇందూరు మీదుగా రైళ్లు నడపాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ముంబై-కరీంనగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతిరోజూ నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

❖ నందిపేట మండలంలోని 429 ఎకరాల్లో ఉన్న సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి)లో వ్యవసాయ, అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పలువురు కోరుతున్నారు.

❖ తెలంగాణలోనే వ్యవసాయపరంగా ముందంజలో ఉన్న జిల్లా కావడంతో సాగు విషయంలో మరింత సాంకేతికతను ప్రోత్సహించేందుకు రైతులకు ఏమేరకు పథకాలు కల్పిస్తారనే విషయమై యువరైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తారా అనే విషయమై ఎదురు చూస్తున్నారు.

❖ హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి డిచ్‌పల్లి వద్ద తయారీ యూనిట్లు నెలకొల్పాలని, డ్రైపోర్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్లు ఉన్నాయి.

❖ బోధన్‌లోని ఎన్‌ఎస్‌ఎఫ్, సారంగాపూర్‌లోని ఎన్‌సీఎస్‌ఎఫ్ చక్కెర యూనిట్లను ప్రారంభించాలని డిమాండ్లు ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీని, డిచ్‌పల్లి వద్ద భారీ వస్తు తయారీ పరిశ్రమను నెలకొల్పాలని డిమాండ్లు ఉన్నాయి. డ్రైపోర్ట్, కంటెయినర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో లాజిస్టిక్ ఫ్రైట్ డిపో ఏర్పాటు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపులు చేస్తేనే ఇవి సాధ్యం. గతంలో జిల్లాలోని జానకంపేట వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.700 కోట్లతో ఇథనాల్ ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు కేంద్రం నిర్ణయించగా, కేసీఆర్ ప్రభుత్వం భూమి ఇవ్వకపోవడంతో ఇథనాల్ ఫ్యాక్టరీ హర్యానాకు తరలివెళ్లింది. ఇక్కడే నెలకొల్పే విషయమై ఐటీసీ ఈడీ రెండుసార్లు జిల్లాకు వచ్చి వెళ్లారు. అయినప్పటికీ గత కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

మహిళా వ్యాపారులను ప్రోత్సహించాలి



బడ్జెట్‌లో మహిళల సాధికారతను పెంచేందుకు తగిన ప్రోత్సాహకాలు కల్పించాలి. నిధులు ప్రత్యేకంగా కేటాయించాలి. అన్ని ప్రాంతాల్లోనూ మహిళా పారిశ్రామికవేత్తలను, మహిళా వ్యాపారులను, స్టార్టప్‌ల విషయంలో ముందుకు వచ్చే ప్రోత్సాహలివ్వాలి. మహిళలను అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలి.

– సరళ మహేందర్‌రెడ్డి, న్యాయవాది, నిజామాబాద్

ఫుడ్ ప్రాసెసింగ్ స్టార్టప్‌లను ప్రోత్సహించాలి..



వ్యవసాయంలో ప్రగతిపథంలో ఉన్న జిల్లాలో రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తరించాలి. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేసి బడ్జెట్‌లో జిల్లాకు నిధులను కేటాయించాలి. ముఖ్యంగా జిల్లాలోని లక్కంపల్లి సెజ్‌లో యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలి. తద్వారా జిల్లాలోనే ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి అదనపు విలువ జోడించి ఎగుమతులు చేయవచ్చు.

– కర్క శ్రీకాంత్‌రెడ్డి, వ్యాపారి, నిజామాబాద్

జీజీహెచ్ ఖాళీ..!



- ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు బదిలీ
- ఏడీ, ఏవోలతో పాటు మరికొందరు సైతం ట్రాన్స్‌ఫర్
- కొత్త వారితో భర్తీ చేసేదెప్పుడో..
- నిత్యం 1200లకు పైగా ఆస్పత్రికి రోగుల తాకిడి
- మెరుగైన వైద్య సేవలందేదెలా..!

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. ఆర్థో, అనస్తీయా, అనాటమీ, పాథాలజీ, పిడియాట్రిషన్లు తదితర విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు ట్రాన్స్‌ఫర్‌పై ఇతర జిల్లాలకు వెళ్లారు. వీరితో పాటు అసోసియేట్ ప్రొఫెసర్లకు స్థానచలనం కలిగింది. దీంతో ఆస్పత్రిలో ఖాళీలు ఏర్పడ్డాయి. దీనివల్ల రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటికే జీజీహెచ్‌కు ప్రతినిత్యం రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. రోజుకు 1200 నుంచి 1800 వరకు రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ఖాళీలు ఏర్పడడంతో వైద్య సేవలు సరిగ్గా అందవని రోగులు, వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నార్మల్ డెలివరీలు 90శాతంపైనే..

ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నాలుగైదేళ్లుగా ప్రజల్లో నమ్మకం పెరిగింది. ముఖ్యంగా గైనిక్ విషయంలో 90 శాతానికి పైగా నార్మల్ డెలివరీలు జీజీహెచ్‌లో చేస్తున్నారు. ప్రైవేటులో 60శాతానికిపైనే సిజేరియన్లు నిర్వహించారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీని గుర్తించిన ప్రజలు నార్మల్ డెలివరీల కోసం జీజీహెచ్‌తో పాటు జిల్లాలో ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారు.

ఖాళీల భర్తీ ఎప్పుడో..!

బదిలీల కారణంగా జీజీహెచ్‌లో ఖాళీలు భారీగా పెరిగాయి. అనస్తీయా ప్రొఫెసర్ కిరణ్‌మాదాల, సర్జన్‌డాక్టర్ సునీల్‌కుమార్, ఆర్థో ప్రొఫెసర్లు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, పిడియాట్రిక్ ప్రొఫెసర్లు గోపాల్ సింగ్, కవిత, అనాటమీ ప్రొఫెసర్ సుధాకర్‌బాబు, పాథాలజీ ప్రొఫెసర్లు నాగార్జున చారి, నరేంద్రకుమార్ బదిలీ అయ్యారు. వీరితో పాటు మరో 9 మంది అసోయేట్ ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. జీజీహెచ్ ఏడీ సంతోష్, ఏవో కూడా బదిలీ అయ్యారు. కానీ ఒకరిద్దరు మాత్రమే బదిలీపై ఇక్కడకు వచ్చారు. దీంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎమర్జెన్సీ విభాగంలో జూనియర్ వైద్యులు విధులు నిర్వహించడంతో అత్యవసర రోగులకు ప్రథమ చికిత్స అందుతోంది. కానీ ముఖ్యమైన పోస్టులు ఖాళీ అవడంతో పెద్ద పెద్ద ఆపరేషన్లు ఆగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రోగులు కోరుతున్నారు.

జీజీహెచ్‌లో అనేక ఆపరేషన్లు

జీజీహెచ్‌లో ఆర్థో, అనస్తీయా, అనాటమీ, పాథాలాజీ, పీడియాట్రిక్ తదితర విభాగాల్లో ప్రొఫెసర్లు రోగులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేశారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ. లక్షల్లో ఫీజులు కట్టి చేయించుకునే ఆపరేషన్లను జీజీహెచ్‌లో అత్యాధునిక పరికరాలతో ప్రొఫెసర్లు ఉచితంగా నిర్వహించారు. ఆర్థో విభాగంలో మోకాలు చిప్పల ఆపరేషన్ల కోసం రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చి మరీ రోగులు వందల సంఖ్యలో ఆపరేషన్లు చేయించుకున్నారు. కంటికి సంబంధించి, పిల్లలకు, అనాటమీ, పాథాలజీ విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు సమన్వయం చేసుకొని రోగులకు ఉత్తమ సేవలు అందించారు.

వెలగని లైట్లు.. ప్రయాణికుల ఇక్కట్లు

- పనిచేయని డిచ్‌పల్లి – బోర్గాం(పి) సెంట్రల్ లైటింగ్
- ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే వృథాగా మారిన వైనం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి – నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రిపూట ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రారంభించిన తర్వాత కొద్ది రోజులకే వృథాగా మారడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లి నుంచి బోర్గాం(పి) వరకు 2018లో రూ. 27.50 కోట్ల నిధులతో రోడ్డు వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైట్లు ఏర్పాటు కోసం శంకుస్థాపన చేశారు. అనంతరం నాలుగేళ్ల పాటు పనులు నత్తనడకన సాగాయి. ఎట్టకేలకు పనులు పూర్తయి సెంట్రల్ లైట్లు ప్రారంభమవడంతో నడిపల్లి నుంచి బోర్గాం(పి) వరకు వాహనదారుల ప్రయాణం సాఫీగా సాగింది. అయితే కొన్ని రోజులకే లైటింగ్‌లో అత్యధిక శాతం లైట్లు వెలగకపోవడంతో ప్రయాణికులకు మళ్లీ తిప్పలు తప్పడంలేదు. రాత్రిపూట డిచ్‌పల్లి – నిజామాబాద్ మధ్య రాకపోకలు సాగించే వాహనదారులు చీకట్లో ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డుపై ఉన్న గుంతలు, అడ్డుగా వచ్చే కుక్కలు కనించక పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక వర్షం వస్తే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సెంట్రల్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



డిచ్‌పల్లి - నిజామాబాద్ రోడ్డుపై వెలగని సెంట్రల్ లైట్లు

గుంతలు కనిపించక ప్రమాదాలు



డిచ్‌పల్లి నుంచి బోర్గాం(పి) వరకు ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రిపూట ద్విచక్ర వాహనంపై నిజామాబాద్‌కు వెళ్లాలంటే లైట్లు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోడ్డుపై గుంతలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు.

– పోల వంశీరెడ్డి, బర్ధిపూర్ గ్రామం

వానొచ్చినా.. భారీ వరద రాలే..!

- ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో అంతంతే..
- నాలుగు రోజుల్లో చేరింది 6.5 టీఎంసీలే
- జలాశయంలో ప్రస్తుతం 21 టీఎంసీల నీరు

బాల్కొండ: ఎస్సారెస్పీకి ఎగువన మూడునాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నా ప్రాజెక్టులోకి భారీ వరదలు రావడంలేదు. డ్యాంలోకి నాలుగు రోజుల వ్యవధిలో కేవలం 6.5 టీఎంసీల నీరు మాత్రమే వచ్చింది. జలాశయంలోకి ఈ సీజన్ ఇప్పటి వరకు గరిష్టంగా 26వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే చేరింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం అంత వేగంగా పెరగడం లేదు. స్థానిక ఎగువ ప్రాంతాల్లో మాత్రమే వర్షాలు కురుస్తుండడంతో ఎక్కువగా వరద రావడంలేదు. ఎస్సారెస్పీకి ప్రధానంగా మహారాష్ట్ర నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుంది. అక్కడ భారీవర్షాలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో వరదలు రావడం లేదు. దిగువన గోదావరి ఉరకలు వేస్తున్నా.. ఎస్సారెస్పీలోకి అంతగా ఇన్‌ఫ్లో లేదు.

నిరాశాజనకంగానే నీటిమట్టం

ప్రాజెక్టులో ప్రస్తుతం నీటిమట్టం నిరాశాజనకంగా ఉంది. డ్యాంలోకి ప్రస్తుతం 20వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 277 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1068.00 అడుగుల(21 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. గతేడాది ఇదే సమయానికి 45.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కానీ ఈ సారి ఇప్పటివరకు ఇందులో సగం కూడా నిండలేదు. దీంతో ఈ సారి ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నిండేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎస్సారెస్పీలో ప్రస్తుత నీటిమట్టం

నల్లూర్ శివారులో ఎన్‌హెచ్-44 పక్కన కుప్పగా పోసిన అరటి పళ్లను తీసుకెళ్తున్న జనం



అరటి పళ్లకోసం ఎగబడ్డ జనం..

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారు జాతీయ రహదారి 44 పక్కన అరటి పళ్లు పెద్ద మొత్తంలో కుప్పగా పడి ఉండటంతో అటు వైపు వెళ్లే జనాలతో పాటు నల్లూర్, ముప్కాల్ గ్రామానికి చెందిన వారు ఎగబడ్డారు. ఆ అరటి పళ్లు ఎందుకు అక్కడ వదిలేసి వెళ్లారో ఎవరికీ అర్థం కావడం లేదు. కాని జనాలు మాత్రం సంచుల్లో, బకెట్లలో నింపుకెళ్లారు. కొందరు జాతీయ రహదారి పక్కన ఉన్న కోతులకు పంచిపెట్టారు. అరటి పళ్ల లోడు బోల్తా పడ్డట్లు ఆనవాళ్లు లేవు. కాని కుప్ప పోసి వెళ్లారు.



సైకిల్‌పై అరటి పళ్లు తీసుకెళ్తూ..

రాంగ్‌రూట్‌లో వెళ్తే కేసులే..

- బైక్‌పై ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠినచర్యలు
- నగరంలోని 18 చోట్ల స్పెషల్ డ్రైవ్‌లు
- ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

ఖలీల్‌వాడి: వాహనాలను రాంగ్‌రూట్‌లో నడిపినా, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ హెచ్చరించారు. నగరంలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నగరంలోని 18 చోట్ల ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం కావాల్సిన సిబ్బందిని సీపీ కేటాయించారని తెలిపారు. నగరంలోని వాహనాదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. అత్యవసరంగా ఫోన్ ఎత్తాల్సి వస్తే రోడ్డుపక్కన నిలిపి మాట్లాడాలని సూచించారు. మొదటి రోజు సోమవారం ఐదుచోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. మంగళవారం నుంచి 18 చోట్ల స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించే ప్రదేశాలివే
కుమార్‌గల్లి నుంచి గాంధీచౌక్
శ్రీదేవి టాకీస్ – పులాంగ్
పూసలగల్లి – మమత పాయింట్
ఎల్‌వీఆర్ – మమత పాయింట్
ఖలీల్‌వాడి – జీజీహెచ్, బస్టాండ్
ఓల్డ్ మనోరమ హాస్పిటల్ – సాయిమెస్
బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ – హరిచరణ్‌మార్వాడీ స్కూల్
పోలీస్ కమిషనరేట్ – నిశిత కాలేజీ
జెడ్పీ ఆఫీస్ – డీఐజీ ఆఫీస్
కంఠేశ్వర్ టీజంక్షన్ – కంఠేశ్వర్ శివాలయం
చంద్రశేఖర్ కాలనీ – కంఠేశ్వర్ టీజంక్షన్
గూపన్‌పల్లి కమాన్ ఎదుట – కృష్ణ మందిర్
శ్రీరామ గార్డెన్ – గంగాస్థాన్ ఫేజ్-2
ఎల్లమ్మగుట్ట – ప్రగతి హాస్పిటల్
ఇండియన్ ఆయిల్ పంప్ – పులాంగ్
పాస్‌పోర్టు ఆఫీస్ – ప్రగతి హాస్పిటల్ జంక్షన్
ఇండియన్ పెట్రోల్ పంపు – ఆర్‌ఆర్ చౌరస్తా
మాలపల్లి చౌరస్తా – బోధన్ రోడ్డు

క్లుప్తంగా

బీఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ నాలుగో సెమిస్టర్‌ రెగ్యులర్‌, 1, 2, 3, 4వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్ష ఫీజును ఆగస్టు 1 వరకు చెల్లించాలని కంట్రోలర్‌ అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఆగస్టు 2వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు.

పీజీ పరీక్ష ఫీజు..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 2, 8వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్ష ఫీజును ఆగస్టు 5వ తేదీ వరకు చెల్లించాలని కంట్రోలర్‌ అరుణ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఆగస్టు 8వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

పీజీ పరీక్షల్లో 13 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్‌, పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షల్లో సోమవారం 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 14 మంది విద్యార్థులకు 14 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 89 మంది విద్యార్థులకు 76 మంది పరీక్ష రాశారని వివరించారు.

31 నుంచి పీజీ ఎగ్జామ్స్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, పీజీ ఇంటిగ్రేటెడ్‌ కోర్సుల బ్యాక్‌లాగ్‌ పరీక్షలు ఈనెల 31న ప్రారంభమై ఆగస్టు 14 వరకు కొనసాగుతాయని కంట్రోలర్‌ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్‌ కోర్సులు ఏపీఈ, ఐపీసీహెచ్‌, ఐఎంబీఏ 1, 3, 4, 7, 9వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు జూలై 31 న ప్రారంభమవుతాయన్నారు. పీజీ నాలుగో సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు ఆగస్టు 6 నుంచి 16వరకు కొనసాగుతాయని వివరించారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సులకు ఈ షెడ్యూల్‌ వర్తిస్తుందన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్‌ బ్యాక్‌లాగ్‌ 5, 6వ సెమిస్టర్‌ పరీక్షలు సోమవారం (20వ రోజు) ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు ముగ్గురు విద్యార్థులకు గానూ ముగ్గురు హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 22 మంది విద్యార్థులకు 21 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఇన్‌స్పైర్‌ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌ అర్బన్‌: ఇన్‌స్పైర్‌ అవార్డుల కోసం జిల్లాలోని ప్రతి పాఠశాల ఐదు నామినేషన్లు పంపించాలని డీఈవో దుర్గాప్రసాద్‌ తెలిపారు. ఇన్‌స్పైర్‌ అవార్డుల కోసం సోమవారం నిర్వహించిన జూమ్‌ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్‌ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉత్తమమైన ప్రాజెక్టులను నామినేషన్లకు పంపాలని సూచించారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి

- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 91 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ మకరంద్‌, ట్రైనీ కలెక్టర్‌ సంకేత్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌ వినతులు స్వీకరించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

నగరంలోని దుబ్బ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్‌ డిమాండ్‌చేశారు. ఈమేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బడిలో సరిపడ గదులు లేవన్నారు.

మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయురాలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. నాయకులు రాజు, వినీత్‌ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

తన తండ్రికి రావాల్సిన ఆస్తిలో వాటా ఇప్పించి న్యాయం చేయాలని మోపాల్‌కు చెందిన దండు మహేందర్‌ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. మహేందర్‌ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు దండు ఐలయ్య, దండు పోసాని మృతిచెందారని, అప్పటి నుంచి తన చిన్నాన్న మల్లయ్య ఆస్తి మొత్తాన్ని ఒక్కడే అనుభవిస్తూ, ఆయన భార్య, కొడుకు పేరుతో బదలాయించారన్నారు. ఆరేళ్ల క్రితం తన తండ్రి వాటా కింద వచ్చే ఆస్తి ఇస్తానని ఒప్పందపత్రం రాసిచ్చాడని, ఇదేవిషయమై అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించారు. తనకు రావాల్సిన వ్యవసాయ భూమి, ఇల్లు, ప్లాట్‌ను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నందిపేట్‌ మండలం తల్వేదలో బొమ్మెన పెద్దన్నపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలు, దళిత ప్రజాసంఘాల జేఏసీ కన్వీనర్‌ సావెల గంగాధర్‌ డిమాండ్‌చేశారు. ఈమేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. గంగాధర్‌ మాట్లాడుతూ దళితుడిపై దాడికి పాల్పడిన సాయిరెడ్డిని తప్పించేందుకు ఆర్మూర్‌ ఏసీపీ, ఎస్సై పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

జీవో 15ను పునరుద్ధరించాలి



కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు జీవో ఎంఎస్‌ నెంబర్‌ 15ను తక్షణమే పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ మహాసభ డిమాండ్‌ చేసింది. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్‌ సామాజికవర్గాన్ని బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్నారు. ముదిరాజ్‌ కో ఆపరేటివ్‌ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటుచేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, ప్రతియేడాదికి రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్‌చేశారు. 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

అటెండర్లు, నైట్‌ వాచ్‌మెన్లను బదిలీ చేయొద్దు



ప్రభుత్వ పాఠశాలల అటెండర్లు, నైట్‌ వాచ్‌మెన్లను బదిలీల రూపంలో బలవంతంగా మండల కార్యాలయాలకు పంపిస్తున్నారని టీఎస్‌ జీహెచ్‌ఎంఏ అధ్యక్షుడు డి మోహన్‌ పేర్కొన్నారు. వారు లేకపోతే తాళాలు తీయడం, శుభ్రపర్చడం, పాఠశాలల రక్షణ వంటి పనులు చేపట్టడానికి ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ధృపతికుమార్‌, లక్ష్మీనర్సయ్య, శ్రీనివాస్‌రావు, నరేష్‌, నరేందర్‌ పాల్గొన్నారు.

స్థానికేతరుల సభ్యత్వం రద్దు చేయాలి

- గౌడ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌ గౌడ్‌
- 'సాక్షి' కథనాన్ని పరిశీలించిన కలెక్టర్‌



సాక్షి కథనాన్ని చూపుతున్న శ్రీనివాస్‌గౌడ్‌

సుభాష్‌నగర్‌: భవాని గీత పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్‌-3 (టీసీఎస్‌) డిపోలో స్థానికేతరులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర దేశాల్లో ఉన్న వారికి సభ్యత్వం కల్పించారని, వెంటనే స్థానికేతరుల సభ్యత్వం రద్దు చేయాలని గౌడ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌ గౌడ్‌ డిమాండ్‌చేశారు. ఈమేరకు 'సాక్షి'లో ప్రచురితమైన కథనం, సాక్ష్యాధారాలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ సాక్షి కథనాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ గౌడ్‌ మాట్లాడుతూ టీసీఎస్‌-3లో అర్హులైన గీత కార్మికులకు అవకాశం కల్పించకుండా బైలా నిబంధనలకు విరుద్ధంగా ఒకే కుటుంబం వారికి సభ్యత్వాలు అందజేశారన్నారు. సేపూర్‌ స్వామి గౌడ్‌తోపాటు రక్త సంబంధీకులు మాత్రమే ఉన్నారని, నిబంధనల ప్రకారం వేర్వేరు కుటుంబాలకు చెందిన వారు ఉండాలని తెలిపారు. వేరే సంఘంలో ఉన్న వారికి కూడా సభ్యత్వం ఇచ్చారని, 2020 నవంబర్‌ 23న జనరల్‌ బాడీ సమావేశంలో నిజమైన గీత కార్మికులకు ట్యాపింగ్‌ టెస్ట్‌ నిర్వహించి కొత్త సభ్యులుగా తీసుకోవాలని తీర్మానం చేసినా.. ఇప్పటివరకూ అమల్జేయడం లేదని ఆరోపించారు. బైలాకు పూర్తిగా విరుద్ధంగా కొనసాగుతున్న టీసీఎస్‌-3లో అక్రమాలను అరికట్టాలని, స్థానికులకు, చెట్లు ఎక్కే వారికే సభ్యత్వం ఇవ్వాలని కోరారు.

గైనకాలజిస్ట్‌ లేకపోవడంతోనే శిశువు మృతి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌



ధర్నా చేస్తున్న బాధితులు

బోధన్‌ టౌన్‌: ఆస్పత్రిలో గైనకాలజిస్టు లేకపోవడంతోనే శిశువు మృతి చెందిందని, తమకు న్యాయం చేయాలని శిశువు మృతదేహంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులు, ఆమ్‌ ఆద్మీ పార్టీ నాయకులు ధర్నా చేశారు. వివరాలు.. బోధన్‌లోని ఆచన్‌పల్లికి చెందిన గర్భిణి రహీఫ ఫిర్దోస్‌కు పురిటి నొప్పులు రావడంతో పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సిబ్బంది సాధారణ ప్రసవం కోసం యత్నించారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్‌ చేయాల్సి రాగా ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌ లేరు. దీంతో సిబ్బంది ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్‌ చేశారు. కుటుంబ సభ్యులు గర్భిణిని పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ డెలివరి చేయగా మృతశిశువు జన్మించింది. ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌ లేకపోవడంతోనే శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు శిశువు మృతదేహంతో ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని ధర్నా చేశారు. పట్టణ సీఐ వీరయ్య వారిని సముదాయించి విషయాన్ని ఆర్డీవో అంబదాస్‌ రాజేశ్వర్‌ దృష్టికి తీసుకు వెళ్లారు. ఉన్నత అధికారులతో మాట్లాడి గైనకాలజిస్టును నియమించేలా చర్యలు చేపడుతామని ఆయన హామీ ఇవ్వడంతో బాధితులు వెనుదిరిగారు.

గడవని పూట.. ఆగని వేట

- నిషేధకాలంలోనూ ఎస్సారెస్పీలో చేపలవేట



చేపలను వేటాడుతున్న మత్స్యకారుడు

బాల్కొండ: పూట గడవకపోవడంతో నిషేధ కాలంలోనూ మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తున్నారు. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేటను నిషేధిస్తారు. రెండు నెలల్లో చేపలు సహజ సిద్ధంగా సంతానాన్ని ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి వేటను నిషేధిస్తారు. కానీ కుల వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులు పూటగడవక పోవడంతో నిషేధ కాలంలో కూడా చేపలు పడుతున్నారు. గతంలో రెండు నెలల వేట నిషేధకాలంలో ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవడం కోసం కొంత మొత్తాన్ని అందించేది. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ పథకం అటకెక్కింది. దీంతో మత్స్యకారులకు పూట గడవడం కష్టమైంది. దీంతో నిషేధం ఉన్నా చేపలను వేటాడుతున్నారు. దీంతో మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుంది.

పథకం రూపొందించినా..

సమీకృత మత్స్య అభివృద్ధి పథకంలో భాగంగా రెండు నెలల వేట నిషేధ కాలంలో మత్స్యకారులను ఆదుకోవడానికి ప్రభుత్వం గతంలో ఓ పథకం అమలు చేసేది. ఎస్సారెస్పీలో చేపలు పట్టడానికి లైసెన్స్‌ ఉన్న మత్స్యకారులు ప్రతి నెల రూ.100 చొప్పున 9 నెలలు రూ.900 చెల్లించాలి. నిషేధ కాలంలో మత్స్యకారులు చెల్లించిన రూ.900కు అదనంగా కేంద్ర ప్రభుత్వం రూ.900, రాష్ట్ర ప్రభుత్వం రూ.900 కలిపి మొత్తం రూ.2700 మత్స్యకారుడికి అందించాలి. దీంతో పాటు 20 కిలోల బియ్యం అందించేలా పథకం రూపొందించారు. మొదటి సంవత్సరం మత్స్యకారులు డబ్బు చెల్లించారు. కానీ ప్రభుత్వం నుంచి సొమ్ము రాలేదు. బియ్యం కూడా పత్త లేకుండాపోయాయి. తర్వాత మత్స్యకారులు ఆసక్తి చూపడం లేదంటు పథకం అటకెక్కించారు. నిషేధకాలంలో ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

'సహారా' డబ్బులు ఇప్పించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

ఆర్మూర్‌: సహారా ఇండియా కంపెనీలో పెట్టుబడి పెట్టి నష్టపోయిన తమకు న్యాయం చేయాలని ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి బాధితులు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను వివరించారు. ఆర్మూర్‌ బ్రాంచ్‌ అధ్యక్షులు బాలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

వినతి పత్రం ఇచ్చిన వారిలో నారాగౌడ్‌, నర్సయ్య, నరేందర్‌, శేఖర్‌, పురుషోత్తం, గోపి, రమేష్‌, సాయికుమార్‌, భూమేశ్వర్‌, గంగాధర్‌ తదితరులు ఉన్నారు.

పంటల పరిశీలన



రుద్రూర్‌: పోతంగల్‌ మండలం టాక్లీ, సోంపూర్‌, దోమలెడ్గి, కోటగిరి మండలం ఎత్తొండ గ్రామాల్లో సోమవారం రుద్రూర్‌ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తున్నందున మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావులో కలిసి కలిసి పంటలను పరిశీలించారు. సోయా పంట కొద్దిగా లేత పసుపు వర్ణంలోకి మారినట్లు గుర్తించి చేనులో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలని రైతులకు సూచించారు. 19:19:19 ఎరువును 10 గ్రాములు 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. క్షేత్ర సందర్శనలో వ్యవసాయ శాస్త్రవేత్తలు జి.నరేందర్‌, ఏ.కృష్ణ చైతన్య, ఏ.దినేష్‌, జి.రవీందర్‌ పాల్గొన్నారు.

నలుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతి



ఖలీల్‌వాడి: జిల్లాలో నలుగురు కానిస్టేబుళ్లు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. సోమవారం సీపీ కార్యాలయంలో పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు సీపీ కల్మేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కానిస్టేబుళ్లు బి.కిషన్‌, సి.అజయ్‌ కుమార్‌(వన్‌ టౌన్‌), బి.సురేష్‌(మోర్తాడ్‌ పీఎస్‌), సీఎస్‌బీలో పని చేస్తున్న ఎస్‌ రవికాంత్‌ పదోన్నతి పొందారు.

ముప్కాల్‌లో పట్టపగలే చోరీ



బాల్కొండ: ముప్కాల్‌లోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కాలనీలోకి చెందిన తాదూరి లింబాద్రి దుబాయిలో ఉంటాడు. ఆయన భార్య ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో ఉన్న పాత ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగుల గొట్టి ఉంది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని ఆర్మూర్‌ ఏసీపీ బస్వారెడ్డి, రూరల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భాస్కరాచారి పరిశీలించారు. ఇంట్లోని తొమ్మిది తులాల బంగారం పోయినట్లు పోలీసులు తెలిపారు.

కాపర్‌వైర్‌, ఆయిల్‌..

నవీపేట: నవీపేట శివారులోని రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి దుండగులు కాపర్‌ వైరు, ఆయిల్‌ చోరీ చేశారని లైన్‌మెన్‌ కృష్ణ సోమవారం ఫిర్యాదు చేశాడు. 100కేవీ, 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి ఆయిల్‌, కాపర్‌ ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

హత్య చేసి.. పూడ్చి పెట్టారు!

- పాత కక్షలతో గొర్రెల కాపరి హత్య
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు!



మల్లయ్య(ఫైల్‌)

కామారెడ్డి క్రైం: పాత కక్షల నేపథ్యంలో ఓ గొర్రెల కాపరి హత్యకు గురయ్యాడు. ఓ మిస్సింగ్‌ కేసు విచారణలో భాగంగా హత్య ఉదంతం వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన జీర్ల చిన్న మల్లయ్య(52) గొర్రెలను కాస్తు జీవనం సాగిస్తున్నాడు. వారం క్రితం నుంచి అతడు కనిపించడం లేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సదాశివనగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఈ నెల 19న మిస్సింగ్‌ కేసు నమోదైంది. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అతడిని హత్య చేసినట్లు అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిసింది.

కుమారుడి ఆత్మహత్యతో..

మల్లయ్య కుమారుడు ప్రవీణ్‌(22) రెండు నెలల క్రితం గ్రామ శివారులో ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు ఆత్మహత్యకు కారణం అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులేనని అనుమానం వ్యక్తం చేస్తూ మల్లయ్య పలు సార్లు వారితో వాగ్వాదానికి దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో వారి మధ్య కక్షలు పెరిగాయని భావిస్తున్నారు. గాయత్రి షుగర్‌ ఫ్యాక్టరి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా మల్లయ్య అదృశ్యమైన రోజు గొర్రెలను మిషన్‌ భగీరథ ప్లాంటు సమీపంలోని ఖాళీ ప్రదేశంలోకి తీసుకెళ్తుండగా అతడిని సదరు ఇద్దరు యువకులు అనుసరించినట్లు రికార్డు అయింది. కాల్‌ డేటా ఆధారంగా మరో యువకుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. మల్లయ్యను నిర్మానుష్య ప్రదేశంలో హత్య చేసి అక్కడే గోతి తీసి పాతి పెట్టినట్లు తెలుస్తోంది. సోమవారం రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో మృతదేహాన్ని గుర్తించే పని వాయిదా పడినట్లు సమాచారం. పోలీసులు మొత్తం వ్యవహారాన్ని గోప్యంగా ఉంచుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నాగిరెడ్డిపేట: మండలంలోని వదల్‌పర్తి గ్రామానికి చెందిన మంగలి దుర్గయ్య(62) సోమవారం హైద్రాబాద్‌లోని గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. వివరాలు.. దుర్గయ్యకు కొంతకాలం క్రితం పక్షపాతం రావడంతోపాటు మతిస్థిమితం కోల్పోయి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో దుర్గయ్య భార్య గోపమ్మ ఆదివారం ఉదయం కూలీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆయన ఇంట్లో కిందపడి అవస్థపడుతూ రోప్పుతు ఉన్నాడు. దీంతో ఏమైందని అడగగా తాను పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో దుర్గయ్యను చికిత్స నిమిత్తం స్థానికుల సహాయంతో గోపాల్‌పేటలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుడి సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం సోమవారం హైద్రాబాద్‌లోని గాంధీఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఖాతాదారుల సొమ్ముతో 'స్టాక్స్‌'లో పెట్టుబడి..!

- యూనియన్‌ బ్యాంక్‌ మేనేజర్‌ నిర్వాకం
- నిందితుడికి హైదరాబాద్‌లో రూ. 1.20 కోట్ల ఇల్లు
- పోలీసుల విచారణలో వెలుగులోకి ఆసక్తికర విషయాలు

ఖలీల్‌వాడి: పెద్దబజార్‌ యూనియన్‌ బ్యాంక్‌ మేనేజర్‌ ఖాతాదారుల నుంచి డబ్బు కాజేసిన కేసులో ఆసక్తికర అంశాలు వెలుగుచూస్తున్నాయి. ఖాతాదారుల నుంచి నిధులను మళ్లించిన మేనేజర్‌ అజయ్‌ స్టాక్‌మార్కెట్‌లో పెట్టినట్లు పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. నిందితుడిని ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసు బృందం అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. పోలీసులు నిందితుడిని విచారణలో భాగంగా స్టాక్‌ మార్కెట్‌లో పెట్టిన పెట్టుబడి, ఎలాంటి సంస్థల్లో ఇన్వెస్ట్‌ చేశాడనే వివరాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఇతర చోట్ల ఏమైనా దాచి పెట్టారా అనే కోణంలోనూ విచారిస్తున్నట్లు సమాచారం. అయితే పోలీసులకు మాత్రం విచారణలో స్టాక్‌ మార్కెట్‌ పెట్టుబడులు పెట్టానని చెబుతున్నట్లు తెలుస్తోంది. తనకు హైదరాబాద్‌లో రూ. 1.20 కోట్ల విలువ చేసే ఇల్లు ఉందని, మరే ఇతర ఆస్తులు లేవని.. ఇల్లుపై రూ. 90 లక్షల లోన్‌ ఉందని చెప్పినట్లు సమాచారం. దీంతో పాటు ఖాతాదారుల నుంచి లోన్లు, వ్యక్తిగతంగా తీసుకున్న అప్పులకు సంబంధించిన వివరాలను అడిగినట్లు తెలుస్తోంది. అయితే ఖాతాదారుల గోల్‌మాల్‌ వ్యవహారం కొలిక్కి రావడానికి సమయం పట్టే అవకాశం ఉంది.

పసుపులారీ ఎత్తుకెళ్లిన కేసులో ఒకరి రిమాండ్‌

ఖలీల్‌వాడి: ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఆర్టీఏ అధికారుల పేరుతో ఈ నెల 17న పసుపు లారీని ఎత్తుకెళ్లిన ఘటనలో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు.. పసుపు లారీని హైజాక్‌ చేసి నిందితులు జన్నేపల్లికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి నాలుగు ట్రాలీ ఆటోల్లో పసుపును నిజామాబాద్‌ మార్కెట్‌కు తరలించి అమ్మారు. వచ్చిన డబ్బులను ప్రధాన నిందితుడు సాదుల్లా చెప్పిన ఇద్దరికి అందించారు. అందులో నిందితుడిగా ఉన్న తౌఫీక్‌ ఆలీని సోమవారం నవీపేట్‌లో అదుపులోకి తీసుకొని, రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నారు. తౌఫీక్‌ ఆలీకి నవీపేట్‌ మండలం జన్నేపల్లిలో ఇనుపసామాను దుకాణం ఉన్నట్లు ఎస్‌హెచ్‌వో చెప్పారు. ప్రధాన నిందితుడు సాదుల్లా పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఒకరి అరెస్ట్‌

కామారెడ్డి క్రైం: పట్టణంలో గంజాయి సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. అశోక్‌నగర్‌ కాలనీకి చెందిన కుంబాల రాజేశ్‌యాదవ్‌ కొంతకాలంగా హైదరాబాద్‌ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి పట్టణంలో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం రావడంతో సోమవారం ఉదయం కామారెడ్డి బస్టాండ్‌ వద్ద అతడిని పట్టుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 740 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వెంటనే పోలీస్‌ స్టేషన్‌కు తరలించి విచారణ జరుపగా నేరం అంగీకరించాడని ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు. నిందితుడిపై పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఇదివరకే ఎనిమిది కేసులు ఉన్నాయన్నారు.

విద్యుత్‌ షాక్‌తో కార్మికుడి మృతి

దోమకొండ: దోమకొండలో సోమవారం విద్యుత్‌షాక్‌తో కార్మికుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిట్ల రాజయ్య(65) రోజువారి కూలీగా మేస్త్రీ వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం ఇంటి నిర్మాణ పనుల్లో ఉండగా బల్బ్‌ను బిగించే క్రమంలో కరెంట్‌ షాక్‌ తగిలింది. వెంటనే స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన మిగతా కార్మికులు వెంటనే అతడిని దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

బోధన్‌ రూరల్‌: సాలూర మండలం సాలంపాడ్‌ క్యాంప్‌లో ఫిబ్రవరిలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. సాలంపాడ్‌ క్యాంప్‌లో కోట శ్రవణ్‌రెడ్డి ఇంట్లో తులం బంగారు గాజులు, రూ.2వేలు నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. సోమవారం మండలంలోని నాగన్‌పల్లి శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో నుంచి వి రాజు, సీహెచ్‌ రాజు పారిపోతుండగా పట్టుకుని విచారించారు. సాలంపాడ్‌ క్యాంప్‌లో తామే చోరీ చేసినట్లు వారు ఒప్పుకోవడంతో అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నాగనాథ్‌ పేర్కొన్నారు.

ఆగని కేబుల్‌ వైర్ల చోరీ

బాల్కొండ: బోరుబావులు, పంపుసెట్ల కేబుల్‌ వైర్ల చోరీలు ఆగడం లేదు. తాజాగా ముప్కాల్‌ మండలం రెంజర్లలో ఆదివారం రాత్రి బోరు బావుల నుంచి, కాకతీయ కాలువపై అమర్చుకున్న పంపు సెట్ల నుంచి కేబుల్‌ ఎత్తుకెళ్లారు. 15 రోజుల క్రితం కేబుల్‌ వైర్ల చోరీలు భారీగా జరిగాయి. దొంగలు వైర్లు ఎత్తుకెళ్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైర్‌తో పాటు, కొన్ని మోటార్ల స్టార్టర్లు కూడా ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం సాగుకు నీరు ఎక్కువగా అవసరం ఉంటుంది. ఈ సమయంలో కేబుల్‌, స్టార్టర్లు ఎత్తుకెళ్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చోరీలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.